


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 09 | సోమవారం 17 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## లెబనాన్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులు

- వైమానిక దాడుల్లో 11 మంది మృతి
- హిజ్బుల్లా దాడులకు ప్రతీకారంగా దాడులు
- లెబనాన్‌కు అండగా ఉంటామన్న ఇరాన్



నబాటిహ్ -సూర్య వాస్తవం :
లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని వివిధ ప్రాంతాలపై భీకర వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందారు. మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు అధికారులు తెలిపారు. హిజ్బుల్లా జరిపిన దాడుల్లో తమ దేశానికి చెందిన ముగ్గురు సైనికులు గాయపడినట్టు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించిన లెబనాన్‌లోని నబాటిహ్ జిల్లాలో గల అన్సార్, డెయిర్ ఎజ్-జహ్రానీ ప్రాంతాలను ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు లక్ష్యంగా చేసుకుని

- మిగతా 2లో..

## రష్యాపై వైమానిక దాడి

- వందలాది డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్
కాలిబూడిదైన గిడ్డంగులు...
- భారీగా నష్టపోయిన వ్యాపారులు



మాస్కో -సూర్య వాస్తవం :
రష్యాపై ఉక్రెయిన్ భీకర వైమానిక దాడులు జరిపింది. గిడ్డంగులు, పారిశ్రామిక ప్లాంట్లు, రిఫైనరీలు సహా రష్యాకు చెందిన పలు లక్ష్యాలపై వందలాది డ్రోన్‌లతో ఆదివారం రాత్రి విరుచుకుపడింది. ఈ దాడులలో కనీసం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఉక్రెయిన్ జరిపిన అతి పెద్ద డ్రోన్ దాడి ఇదేనని రష్యా ప్రభుత్వ టాస్ న్యూస్ తెలియజేసింది. ఉక్రెయిన్ ప్రయోగించిన 800 డ్రోన్లను కూల్చివేశామని మాస్కో గవర్నర్ ఆంద్రే ఓరోబియేవ్ చెప్పారు. మాస్కో ప్రాంతం పైకి దూసుకొచ్చిన 187 డ్రోన్లను గగనతల రక్షణ దళాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ యూనిట్లు తటస్థం చేశాయని ఆయన తెలిపారు. రాజధాని మాస్కోలో సంపన్నులు అధికంగా నివసించే ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ డ్రోన్ దాడి జరిపింది. మాస్కో ప్రాంతంలో

- మిగతా 3లో..



## భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

- అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాలూ కలిసి పని చేస్తున్నాయి
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం కృషి
- స్వాతంత్ర్య వేడుకల వేళ రష్యా అధ్యక్షుడి ప్రశంసలు
- ద్రౌపదీ ముర్ము, మోదీలకు పుతిన్ శుభాకాంక్షలు

2లో

### భోగాపురం ఎయిర్‌పోర్టులో మొదలుకానున్న

## విమాన సర్వీసులు

- రేపు భోగాపురంలో దిగే తొలి విమానం ఇదే.. ప్రయాణికులకు గిఫ్టులు!
- హైదరాబాద్ నుంచి తొలి విమానంగా ఇండిగో ఫ్లైట్
- తొలి ప్రయాణికులకు ఏటికొప్పాక బొమ్మలతో ప్రత్యేక స్వాగతం
- బెంగళూరు నుంచి రెండో విమానంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

అమరావతి - సూర్య వాస్తవం
ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరుతూ, భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సర్వీసులు ఈ అర్ధరాత్రి తర్వాత ప్రారంభమవుతున్నాయి. ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలుకుతూ హైదరాబాద్ నుంచి ఇండిగో విమానం తొలిసారిగా ఇక్కడి రన్‌వేపై అడుగుపెట్టనుంది. ఈ అపురూప క్షణంతో ఈ ప్రాంత విమానయాన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలు కానుంది. విమానాశ్రయ ప్రారంభోత్సవంలో భాగంగా తొలి విమానంగా



ఇండిగోకు చెందిన 6ఇ6408 ఫ్లైట్ హైదరాబాద్ నుంచి ఉదయం 6:45 గంటలకు భోగాపురంలో ల్యాండ్ అవుతుంది.

- మిగతా 2లో..



### స్నాతకోత్సవానికి

## చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించవద్దు..

- మరో లా కాలేజీ విద్యార్థుల లేఖ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం
త్వరలో జరగనున్న స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రాను ఆహ్వానించవద్దని

- మిగతా 2లో..

### కేంద్ర క్యాబినెట్‌లోకి

## యువత, మహిళలు?

- ప్రధాని అధ్యక్షతన నేడు భేటీలో నిర్ణయానికి అవకాశం
- శాసనపరమైన ఏజెండాలపై సమీక్ష
- ఆర్థిక, పరిపాలనా చర్యలపై నిర్ణయాలు
- ఎర్రకోట వేదికగా ప్రధాని ప్రకటించిన ఆరు నిర్ణయాలపై సుధీర్ఘ సమీక్ష

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం
ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నేడు (సోమవారం) నిర్వహించనున్న కేంద్ర క్యాబినెట్ భేటీలో మంత్రివర్గంలో మహి ళలు, యువత కు దక్కే అవకాశం ఉన్నట్లు బీజేపీ పార్టీ సన్నిహిత వర్గాలు పేర్కొంటు న్నాయి. ఇప్పటికే ప లుమార్లు క్యాబినెట్ భేటీలో ఈ అంశంపై సుధీర్ఘంగా చర్చిం చారు. అయితే క్యాబినెట్‌ను విస్తరిస్తారా? విస్తరిస్తే ఎవరెవరికి అవకాశాలు కల్పిస్తారు? పేర్లను ప్రకటిస్తారా? అన్నది భేటీ అనంతరం ప్రకటించే అవకాశం ఉంది.మరోవైపు 2027 ఐదు రాష్ట్రాల ఎన్నికలు, 2029 దేశవ్యాప్త ఎన్నికలు, ఇటీవల దేశంలో జరుగుతున్న జెన్ జీ పరిణామాల నేపథ్యంపై కూడా చర్చించనున్నారు. ఏది ఏమైనా ఈ సమావేశంలో క్యాబినెట్‌లో మారు చేర్పులకు అవకా శం ఉన్నట్లుగా తెలు స్తుంది. ఇటీవల నిర్వహించిన పార్ల మెంటరీ సమావేశాల్లోని శాసనపరమైన ఏజెండాలపై కూడా సమీక్షించనున్నారు.



పరిపాలనా, ఆర్థిక చర్యలపై కూడా పలు నిర్ణయాలు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మరోవైపు పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలోని గ్యాస్ నిల్వల పెంపుదలపై పలు సంస్థలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. దీనిపై కూడా క్యాబినెట్‌లో సమీక్షించనున్నారు. ఇంకోవైపు ఎర్రకోట నుంచి

- మిగతా 2లో..

## మాది సామాజిక న్యాయం

- వాళ్లు రక్తపిశాచులు...సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు
- కేసీఆర్‌ను సైతం తీసుకురావాలని కేటీఆర్, హరీశ్‌లకు విజ్ఞప్తి
- ఆయన విలువైన సూచనలిస్తే రాష్ట్రానికి ఉపయోగం
- నా లెక్కలన్నీ పక్కా చెబుతాను.. ఎవరి పాలనేంటో అక్కడే తేల్చుకుందాం
- పరకాల సభలో సీఎం రేవంత్‌రెడ్డి..
- ములుగు జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవం



హైదరాబాద్ - సూర్య వాస్తవం
'మాజీ సీఎం కేసీఆర్‌ది కుటుంబ న్యాయం.. తమది, తమ పార్టీది సామాజిక న్యాయం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో వాళ్ల కుటుంబ సభ్యులకు పదవులిస్తే.. తాము మాత్రం సామాజిక సూత్రాన్ని పాటించామని తెలిపారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ములుగు, పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ్షలు చేశారు. సాయంత్రం పరకాలలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ శాసనసభకు రాకుండా కేసీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ములుగు, పరకాల నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సాయంత్రం పరకాలలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ శాసనసభకు రాకుండా కేసీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. కేసీఆర్

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



### చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..

## రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం
- డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని

కీలక సూచనలు
- పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

2లో

# భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

న్యూఢిల్లీ-సూర్య వాస్తవం

భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా దేశాల మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరుదేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని అన్నారు.భారత అభివృద్ధి ప్రయాణానికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టంచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రష్యా వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికీనా, ఆంద్రే ఫెద్యాయెవ్ కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు

# కేంద్ర క్యాబినెట్‌లోకి యువత, మహిళలు?

(మొదటిపేజీ తరువాయి)
ప్రధానమంత్రి మోదీ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఆరు అంశాలపై కూడా సమీక్షించే అవకాశం ఉంది. ఇందులో కోటిమందికి ఉపాధి, మేడ్ ఇన్ ఇండియా నానో మైక్రో చిప్స్ తయారీకి కేంద్రంగా చేయడం, దీపావళికి ముందు నిత్యావసరాల ధరలను మరింత తగ్గించేందుకు పన్నులను తగ్గించడం, 2047 అభివృద్ధికి రోడ్ మ్యాప్ ( వికసిత్ భారత్ డాలర్ల ఎకానమీ దిశగా అడుగులు), దేశంలో నిర్మితమవుతున్న 10 న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్మాణాలపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు కూడా సమాచారం.

### చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..

# రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

అమరావతి - సూర్య వాస్తవం

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, “ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన ‘హనుమాన్’ బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి” అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

# 2026 అనంతపురం క్లబ్ స్నూకర్ ఛాంపియన్‌గా షౌకత్ ఖాన్



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం నగరం నేడు ప్రతిష్ఠాత్మక అనంతపుర్ క్లబ్ లో నిర్వహించిన స్నూకర్ 2026 ఛాంపియన్‌షిప్‌లో వరుస విజయాలతో షౌకత్ ఖాన్ ఛాంపియన్ గా నిలిచారు. తనదైన శైలితో ప్రత్యర్థులకు చెక్ పెడుతూ విజయం తన సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆగస్ట్ 15న 80వ ఇండిపెండెన్స్ డే రోజున అనంతపుర్ క్లబ్ యాజమాన్యం వారు, ఆయన సన్నిహితులు మరియు క్లబ్ సభ్యులు విజేతకు చిరుసత్కరించి హర్షం వ్యక్తం చేశారు.

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులు

(మొదటిపేజీ తరువాయి)
శనివారం తెల్లవారుజామున విరుచుకుపడ్డాయి. అన్సార్‌లో ఒక నివాస గృహంపై జరిపిన క్షిపణి దాడిలో ముగ్గురు చిన్నారులతో సహా ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. అలాగే డెయిర్ ఎజ్-జహ్రానీలో జరిగిన మరో వైమానిక దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

17 మంది తీవ్రంగా గాయపడినట్లు అంతర్జాతీయ మీడియా రాసుకొచ్చింది. లెబనాన్‌పై దాడులతో పాటు పౌరులు మృతి చెందిన విషయాన్ని ఇజ్రాయిల్ సైన్యం ధ్రువీకరించింది. అయితే, హిజ్బుల్లానే ఉద్దేశపూర్వకంగా ఆ సైనిక శిబిరాల్లో పౌరులను ఉంచిందని ఐడీఎఫ్ ఆరోపించింది. మృతి చెందిన మహిళలు, పిల్లలు ఒక సీనియర్ హిజ్బుల్లా కమాండర్ కుటుంబ సభ్యులని ఇజ్రాయిల్ మీడియా పేర్కొంది.

**లెబనాన్ -- ఇజ్రాయిల్ మాటల యుద్ధం**

జూన్ లో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్ , లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే తాజాగా ఇజ్రాయిల్ సైనికులపై హిజ్బుల్లా దాడులకు పాల్పడడంపై ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆగ్రహం వ్యక్తం చేశారు. లెబనాన్ ఒప్పందం ఉల్లంఘించిందని మండిపడ్డారు. మరోవైపు, ఇజ్రాయిల్ చర్యలపై లెబనాన్ తీవ్రంగా స్పందించింది. త్వరలో అమెరికా ఆధ్వర్యంలో లెబనాన్-ఇజ్రాయిల్ మధ్య కీలకమైన చర్చలు జరగనున్నాయని పేర్కొంది. ఆ చర్చల వేళ తమను బెదిరించేందుకే ఈ దాడులు చేసిందని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఆరోపించారు.

**ఇజ్రాయిల్ చర్యలు చట్టాల ఉల్లంఘనే: ఇరాన్**

దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన వైమానిక దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్ చర్యలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది. లెబనాన్ జాతీయ సార్వభౌమత్వాన్ని కాలరాసేలా ఉన్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో ముగ్గురు పిల్లలు, ఇద్దరు మహిళలతో సహా మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోవడం, పలువురు గాయపడడంపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ చేపట్టిన ఈ క్రూరమైన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దాడుల వల్ల నివాస ప్రాంతాలు, సివిలియన్ భవనాలు నేలమట్టమయ్యాయని బఘాయి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో లెబనాన్ ప్రజల ప్రతిఘటనను ఆయన ప్రశంసించారు. లెబనాన్ స్వాతంత్ర్యం, గౌరవాన్ని కాపాడుకోవడంలో ఆ దేశానికి ఇరాన్ ఎప్పుడూ సంపూర్ణ సంఘీభావం, మద్దతు ఇస్తుందని మరోసారి స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ అరాచకాలపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అనుసరిస్తున్న మౌనం అత్యంత శోచనీయమని అన్నారు. అంతర్జాతీయ చట్టాలను, మానవతా సూత్రాలను ఇజ్రాయిల్ బహిరంగంగా ఉల్లంఘిస్తున్నా పెద్ద దేశాలు, అంతర్జాతీయ సంస్థలు స్పందించకపోవడం దారుణమని బఘాయి తెలిపారు.

**గాజాలోనూ ఉద్రిక్తతలు**

లెబనాన్‌తో పాటు గాజా స్ట్రిప్‌లోనూ ఇజ్రాయిల్ సైనిక చర్యలు కొనసాగుతున్నాయి.

గురువారం దక్షిణ గాజాలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో హమాస్ ఖాన్ యూనిస్ బ్రిగేడ్ కంపెనీ కమాండర్ హుదైఫా ఖాలెద్ సులేమాన్ కవారీ హతమైనట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. హమాస్‌కు శిక్షణ ఇవ్వడం, సరిహద్దుల గుండా ఆయుధాలను రవాణా చేయడం, ఉగ్రవాద సంస్థ సైనిక సామర్థ్యాలను పునరుద్ధరించడంలో కవారీ కీలక పాత్ర పోషించినట్టు ఇజ్రాయిల్ పేర్కొంది.

### భోగాపురం ఎయిర్‌పోర్టులో మొదలుకానున్న

# విమాన సర్వీసులు

(మొదటిపేజీ తరువాయి)
ఆ తర్వాత కొద్దిసేపటికే, ఉదయం 7:30 గంటలకు బెంగళూరు నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ×శ2064 విమానం కూడా ఇక్కడికి చేరుకుంటుంది. ఈ రెండు విమానాల రాకతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకు చెక్-ఇన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అనంతరం, తొలి ప్రయాణికులకు బోర్డింగ్ పాసులు అందజేసి, ఎయిర్‌లైన్స్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోనున్నారు. తొలి విమానాల్లో వచ్చిన ప్రయాణికులకు అధికారులు ప్రత్యేక రీతిలో స్వాగతం పలకనున్నారు. వారికి స్థానిక సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఏటికొప్పాక బొమ్మలు, ఫస్ట్-ఫ్లైట్ సర్టిఫికెట్లతో కూడిన గూడీ బ్యాగ్‌లను కానుకలుగా అందజేయనున్నారు. ఇదిలా ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 20 వరకు హై అలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో విమానాశ్రయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులు భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు.

**భోగాపురం నుంచి ఢిల్లీకి 14 విమానాలు**

విశాఖపట్నం నుంచి కార్యకలాపాలు సాగించే ఎయిరిండియా విమాన సర్వీసులన్నీ ఇకపై భోగాపురంలోని నూతన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడవనున్నాయి. ఆగస్టు 17 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుందని ఎయిరిండియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు ఎలాంటి గందరగోళం లేకుండా, పాత విశాఖ ఎయిర్‌పోర్ట్ కోడ్ ఙ్గనే కొత్త విమానాశ్రయానికి కూడా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. భోగాపురం నుంచి ఢిల్లీకి వారానికి 14 విమాన సర్వీసులను యథాతథంగా కొనసాగిస్తామని సంస్థ వెల్లడించింది. దీని ద్వారా తమ హబ్స్ మీదుగా కీలకమైన దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు ప్రయాణికులు సులభంగా చేరుకోవచ్చని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల మధ్య విమాన కనెక్టివిటీని మెరుగుపరిచేలా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నగరాలకు పలు రోజువారీ సర్వీసులను నడపనున్నట్లు తెలిపింది. కొత్త షెడ్యూల్ ప్రకారం, హైదరాబాద్ - భోగాపురం మధ్య రోజుకు రెండు విమాన సర్వీసులు నడుస్తాయి. బెంగళూరు - భోగాపురం మధ్య కూడా రోజుకు రెండు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అదనంగా సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో మరో రిటర్న్ సర్వీసును కూడా నడపనున్నారు. ప్రస్తుత ఏవియేషన్ టైమ్‌టేబుల్ ప్రకారం, ఈ కొత్త విమాన షెడ్యూల్ అక్టోబర్ 24 వరకు అమల్లో ఉంటుంది.

విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన ఈ కొత్త విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సుమారు 77,342 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కొత్త టెర్మినల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక వసతులు కల్పించారు. ఇందులో 22 సంప్రదాయ చెక్-ఇన్ కౌంటర్లు, 18 సెల్ఫ్-బ్యాగేజ్ డ్రాప్ యూనిట్లు, అధునాతన స్క్రీనింగ్ వ్యవస్థలు, అత్యాధునిక బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సౌకర్యాలతో పాటు ఏడు ఏరోబ్రిడ్జ్‌లు ఉన్నాయి. ఇకపై ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌ను రక్షణ, పోలీసు అవసరాలు, వీఐపీల రాకపోకలు, షెడ్యూల్ లేని ప్రత్యేక విమానాల కోసం మాత్రమే వినియోగిస్తారని అధికారులు తెలిపారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్‌కు సేవలందించే ఈ విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయి.

# మాది సామాజిక న్యాయం

(మొదటిపేజీ తరువాయి)
తన కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు ఇచ్చుకున్నాడని గుర్తు చేశారు. కానీ.! తాను మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆడబిడ్డలైన సీతక్క, కొండా సురేఖలను మంత్రిపదవుల్లో కూర్చోబెట్టామని తెలిపారు. కేసీఆర్ ఎర్రబెల్లికి మినిస్టర్ పదవి ఇస్తే.. తాను దళితుడైన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ని మంత్రిని చేశానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కవితను ఎంపీ చేస్తే తాను మాత్రం ఎస్సీ ఆడబిడ్డ అయిన కడియం కావ్యను పార్లమెంట్‌కు పంపానని వివరించారు. యశస్విని ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపానని తెలిపారు. కేసీఆర్ తన సడ్డకుని కొడుకు సంతోష్‌రావును ఎంపీ చేస్తే తాము మిత్ర ధర్మం పాటించి వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభకు పంపామని తెలిపారు. ఉద్యమకారుడైన కోదండరామ్‌కి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. కేసీఆర్ మాత్రం తన కొడుక్కి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కట్టబెట్టారని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు తాము బీసీ బిడ్డ అయిన మహేశ్‌కుమార్ గౌడ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించామని అన్నారు. ఈ రకంగా కేసీఆర్ హయాంలో ఆయన కుటుంబానికే న్యాయం జరిగితే తమ పార్టీ హయాంలో సబ్బండ వర్గాలకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందని సీఎం వివరించారు.

**సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు..**

అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్, హరీశ్‌రావు పదే పదే అడుగుతున్నారని, రాష్ట్ర అభివృద్ధిపై సెప్టెంబర్ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తేల్చుకుందా మని బీఆర్ఎస్ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. నా లెక్కలన్నీ పక్కా చెబుతానని, సుమారు ఈ మూడేండ్ల పాలనలో మేం చేసిన అభివృద్ధిని, మీరు చేయలేని పనులను పూర్తిస్థాయిలో చర్చిద్దా మన్నారు. ఈ సమావేశాలకు కేటీఆర్, హరీశ్‌రావులే కాకుండా కేసీఆర్ ను సైతం తీసుకురావాలని కోరారు. ఆయన సలహాలు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడతాయని అన్నారు. కేసీఆర్ నాకు రాష్ట్రాన్ని అప్పగించిన సమయంలో 8లక్షల11వేల కోట్ల అప్పులను అప్పగించారని అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రంపై రూ.6500కోట్ల అప్పుల భారమే ఉండేదని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 8లక్షల11వేల కోట్లకు అప్పులు పెరిగాయన్నారు. లక్ష రూపాయలు రుణ మాఫీ చేస్తామని కేసీఆర్ రైతులను మోసం చేశారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 25లక్షల మంది రైతులకు 2లక్షల రుణమాఫీలో భాగంగా 25వేలా 617కోట్లను రైతుల ఖాతాల్లో వేసి రుణ విముక్తులను చేశామన్నారు. రూ.36వేల కోట్ల నిధులను రైతుభరోసాకు ఇచ్చామన్నారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30వేల కోట్లను రైతుల ప్రయోజనార్థం ఖర్చు పెడుతున్నామన్నారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదువులు ఇచ్చామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్స్, ఆర్టీసీ బస్సులకు యజమానులుగా చేసిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

**కేసీఆర్ ధృతరాష్ట్రుడా ?**

కేసీఆర్ బిడ్డ కవితకు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని కర్కోటకుడైన అన్న కేటీఆర్ కవితను మెడలు పట్టి బయటకు నెట్టారని, దీన్ని సరిదిద్దాల్సిన కన్నతండ్రి కేసీఆర్ ధృతరాష్ట్రుడిగా ప్రేక్షకపాత్ర వహించారని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీరెలను ఎన్నడన్న కట్టుకున్నారా..చేండ్లలో అడవి పందులను బయపెట్టడానికి ఆ చీరెలను కట్టారని, కానీ మేము ఇచ్చిన పాలపిట్ట చీరెలు కట్టుకుని వచ్చిన మహిళలకు అన్నగా నేను ఎంతో సంతోష పడుతున్నానని అన్నారు.

**నిరుద్యోగులు రెచ్చిపోవ్వొదు**

నిరుద్యోగులు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇప్పటి వరకు 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ కూడా వేశామన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో గరిష్ట వయోపరిమితిని కూడా పెంచామని, ఈ విషయాన్ని నిరుద్యోగులు గ్రహించాలని కోరారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియమాకాలు చేయలేదన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి 1200మంది యువకులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కారకులయ్యారని అన్నారు. రెచ్చగొట్టాలి...మంది పిల్లలను చంపగొట్టాలనే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఇటీవల బీఆర్ఎస్ నేతలు రక్తదాన శిబిరం నిర్వహించారని, ఇందులో కేసీఆర్ గానీ, అతని కుటుంబ సభ్యులు ఎవరూ రక్తదానం చేయలేదన్నారు. కార్యకర్తలు మాత్రం రక్తదానం చేశారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు రక్త పిశాచాలుగా మారారని, హరీశ్‌రావు, కేటీఆర్,ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్‌రావు, సంతోష్‌రావులు ఎందుకు రక్తదానం చేయలేదని ప్రశ్నించారు. కాకలు తీరిన నాయకుడని చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్‌రావును చిన్న అమ్మాయి యశస్విని 50వేల మెజార్టీతో ఓడించి బండకేసి కొట్టిందన్నారు. ఇది నా విజయమో.. యశస్విని విజయమో కాదని, ఇది ప్రజల విజయమని అన్నారు. రైతు, మహిళల అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నామని, నిండు మనస్సుతో 2029లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# రాజీవ్ గాంధీ వల్లే నేను బతికి ఉన్నాను..

## - అటల్ బిహారీ వాజపేయ్ వర్ధంతి సందర్భంగా.. ఆయన జీవితంలో జరిగిన ఒక అరుదైన ఘటన ఇది..



1988లో అటల్ బిహారీ వాజ్‌పాయ్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. వైద్యులు అమెరికాలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఆ సమయంలో అమెరికాలో చికిత్స ఖర్చులు భరించడం వాజ్‌పాయ్ గారికి కష్టంగా ఉండేది. అప్పుడు ప్రధానిగా ఉన్న రాజీవ్ గాంధీకి వాజ్‌పేయ్ ఆరోగ్య పరిస్థితి తెలిసింది. ఆయన వాజ్‌పేయ్ గారిని తన కార్యాలయానికి పిలిపించి, భారత ప్రతినిధి బృందంలో భాగంగా ఖచీ సమావేశానికి అమెరికా వెళ్లాలని చెప్పారు. “ఈ అమెరికా పర్యటనను పూర్తిగా మీ చికిత్స కోసం ఉపయోగించుకోండి” అని సూచించారు. అధికారులు కూడా చికిత్స పూర్తయ్యే వరకు వాజపేయ్ గారికి సహకరించాలని ఆదేశించినట్లు వాజపేయ్ గారే స్వయంగా తరువాత వెల్లడించారు. అమెరికా వెళ్లి చికిత్స చేయించుకుని వచ్చిన తర్వాత వాజ్‌పేయ్ ఈ విషయాన్ని జీవితాంతం గుర్తుంచుకున్నారు. రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఆయన ఒక ఇంటర్వ్యూలో “రాజీవ్ గాంధీ వల్లే నేను బతికున్నాను” అనే భావాన్ని వ్యక్తం చేశారు.

ఇందులో నేటి రాజకీయాలకు ఉన్న స్ఫూర్తి ఏమిటంటే.. అప్పుడు రాజీవ్ గాంధీ కాంగ్రెస్ ప్రధానమంత్రి, వాజ్‌పేయ్ ప్రతిపక్షానికి చెందిన బీజేపీ నాయకుడు. రాజకీయంగా ఇద్దరూ ప్రత్యర్థులే. అయినా వ్యక్తిగతంగా ఒకరి పట్ల మరొకరికి గౌరవం ఉండేది.

రాజకీయాల్లో ప్రత్యర్థులు కావచ్చు.. శత్రువులు కావాల్సిన అవసరం లేదు. అధికారం, పార్టీలు, సిద్ధాంతాలు మారిపోతాయి. కానీ మానవత్వం, వ్యక్తిగత గౌరవం, దేశం కోసం కలిసి పనిచేసే సంస్కారం శాశ్వతంగా నిలిచిపోతాయి. ఇదే కారణంగా రాజీవ్ గాంధీ--అటల్ బిహారీ వాజ్‌పాయ్ ఘటనను నేటి రాజకీయాలకు ఒక ఆదర్శంగా చెప్పుకోవచ్చు. పార్టీల మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నా, ఒక నాయకుడి ప్రాణం విషయంలో మరో నాయకుడు పార్టీ గీతలను పక్కన పెట్టడం అప్పటి రాజకీయ సంస్కృతికి నిదర్శనం. వాజ్‌పేయ్ అమెరికా వెళ్లింది రాజకీయ ప్రయోజనం కోసం కాదు.. రాజీవ్ గాంధీ రాజకీయ ప్రత్యర్థి ప్రాణాన్ని కాపాడేందుకు చూపిన మానవత్వం వల్ల. అదే ఈ ఘటనకు ఉన్న అసలు గొప్పతనం.

# రష్యాపై వైమానిక దాడి

ఆదివారం జరిగిన డ్రోన్ దాడిలో 83 సంవత్సరాల వృద్ధుడు చనిపోయాడు.

ఉక్రెయిన్ దాడుల కారణంగా మాస్కో ప్రాంతంలోని అతి పెద్ద వైల్డ్‌బెర్రీస్ గిడ్డంగుల వద్ద భారీగా మంటలు వ్యాపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. ఎలక్ట్రోస్టాల్, కొలెడినో ప్రాంతాలలోని గిడ్డంగులు మంటలలో కాలిపోయాయి. దాచుకున్న సరుకు బూడిదైపోవడంతో వ్యాపారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. ఆన్‌లైన్ వ్యాపారులు సరఫరాలను నిలిపివేశారు. ఇటీవలి కాలంలో వైల్డ్‌బెర్రీస్ గిడ్డంగులను ఉక్రెయిన్ సేనలు లక్ష్యంగా చేసుకొని పదే పదే దాడులు జరిపాయి. దీంతో పొరుగున ఉన్న కజకస్థాన్‌లో కొత్త గిడ్డంగిని నిర్మించామని కంపెనీ కొద్ది కాలం క్రితమే ప్రకటించింది. ఉక్రెయిన్ నుంచి 17 ప్రాంతాల వైపు...ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ ప్రాంతాల వైపు వచ్చిన డ్రోన్లను అడ్డుకున్నామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దాడుల కారణంగా దక్షిణ రష్యాలోని రోస్తావ్‌లో ఐదుగురు మరణించారు.

**కీవ్‌పై రష్యా ప్రతి దాడులు**

రష్యా కూడా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై డ్రోన్, క్షిపణి దాడులు జరిపింది. ఆదివారం ఉదయం జరిగిన దాడులలో ఆరుగురు గాయపడ్డారు. సెంట్రల్ ఉక్రె యిన్‌లోని కొన్ని ప్రాంతాలపై బాలిస్టిక్ క్షిపణి దాడులు జరగగా ముగ్గురు చనిపోయారు. రష్యా ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను ఉక్రెయిన్ కూల్చలేకపోయింది. బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే వ్యవస్థల కొరతే దీనికి కారణం. గత వారం రోజుల వ్యవధిలో రష్యా 1,550 డ్రోన్ దాడులు, 62 క్షిపణి దాడులు జరిపిందని, సుమారు 1,560 గైడెడ్ ఏరియల్ బాంబులు వేసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు.

# ఉత్తమ సేవకు..... ఉత్తమ పురస్కారం

## - ఆరోగ్య వైద్య అధికారి చేతులమీదుగా గంగాధర్‌కు ప్రశంసా పత్రం



అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం : 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇందులో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్య విద్య అధికారిగా పనిచేస్తున్న యల్లప్ప గారి గంగాధర్ కు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గంగాధర్‌ను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ ప్రసన్న భారతి, డాక్టర్ గంగాధర్ రెడ్డి, డాక్టర్ మనోజ్, కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్, డెమో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



- గ్రామ సమస్యల పరిష్కారంలో యువత కీలక పాత్ర పోషించాలి
- ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం
- యువత--గ్రామ పెద్దలు కలిసి సమస్యలకు పరిష్కారం చూపాలి
- ఉపాధి హామీ పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా చేపట్టాలి .!

# మన ఊరు-మన బాధ్యత

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం ప్రత్యేక కథనం**

ఒకప్పుడు గ్రామాల్లో సర్పంచ్, ఎమ్మెల్యే ఎన్నికలు జరిగినప్పుడు అభ్యర్థులు ప్రచారానికి వస్తే.. గ్రామ ప్రజలు తమ సమస్యలను స్పష్టంగా వారి ముందుంచేవారు. “మా ఊర్లో రోడ్లు బాగాలేవు.. డ్రైనేజీ సమస్య ఉంది.. పాఠశాలలో సమస్యలు ఉన్నాయి.. ఆలయానికి మరమ్మతులు అవసరం” అంటూ గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు చేస్తేనే ఓటు వేస్తామని చెప్పేవారు. సర్పంచ్ ఎన్నికల్లోనూ గ్రామానికి ఉపయోగపడే పనులు చేసే అభ్యర్థినే ఎన్నుకునే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం పరిస్థితి క్రమంగా మారుతోంది. “నాకేం వస్తుంది? నా కుటుంబానికి ఏమి ప్రయోజనం?” అనే ఆలోచన వ్యక్తిగత ప్రయోజనాల వైపు ప్రజలను నడిపిస్తోంది. కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం గ్రామాలను రెండు వర్గాలుగా విభజించి, ఆ విభేదాల ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా గ్రామాల అభివృద్ధి వెనుకబడుతోంది.ఈ పరిస్థితిలో యువత పాత్ర ఎంతో కీలకం. తల్లిదండ్రులు లేదా పాత తరాల రాజకీయ విభేదాలను అను సరించకుండా.. గ్రామానికి ఏమి అవసరం? ప్రజలకు ఏ సమస్యలు ఉన్నాయి? వాటిని ఎలా పరిష్కరించాలి? అనే ఆలోచనతో యువత ముందుకు రావాలి.ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతోమంది ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, అధికారులు, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారు. కానీ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై నమ్మకం తగ్గడంతో, తల్లిదండ్రులు వేల రూపాయలు ఫీజులు చెల్లించి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువు ఎలా సాగుతోంది?

ఉపాధ్యాయులు విద్యార్థులకు సక్రమంగా బోధిస్తున్నారా? అనే విషయాలను తెలుసుకునేందుకు కనీసం పది నిమిషాలు కేటాయించి పాఠశాలను సందర్శించే బాధ్యత కూడా మనలో తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయం. గ్రామ సమస్యలను పరిష్కరించడంలో యువతతో పాటు గ్రామ పెద్దలు కూడా భాగస్వాములు కావాలి. కొంతమంది యువకులు ఒక బృందంగా ఏర్పడి గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించాలి. వాటిపై గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి.అలాగే ఉపాధి హామీ పనులను అవసరం లేని ప్రాంతాల్లో కాకుండా గ్రామానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా చేపట్టాలి. గ్రామ పరిసరాల్లోని చెరువులు, కుంటలు, కాలువలను శుభ్రం చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలి. నీటి నిల్వలు పెరిగితే భూగర్భ జలాలు మెరుగుపడి, చుట్టుపక్కల బోరుబావులు ఎండిపోకుండా ఉండే అవకాశం ఉంటుంది. యువత, గ్రామ పెద్దలు, ప్రజలు కలిసి ఒక సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే గ్రామాల్లో అనేక సమస్యలకు స్థానికంగానే పరిష్కారం లభిస్తుంది. రాజకీయ విభేదాలకు అతీతంగా గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలి.

**గ్రామం మనది.. బాధ్యత కూడా మనదే.**

ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించినప్పుడే పరిశుభ్రమైన, సుందరమైన, అభివృద్ధి చెందిన గ్రామాన్ని నిర్మించగలం. మన ఊరి అభివృద్ధి కోసం ఎదురు చూడటం కాదు.. మనమే ముందడుగు వేయాలి.

“మన ఊరు -- మన బాధ్యత” అనే ఆలోచన ప్రతి ఒక్కరిలోనూ కలిగినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది.

# ఘనంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి 106వ జయంతి

- రాయలసీమ అపర భగీరథుడు మన కోట్ల
- మచ్చ లేని మహా నాయకుడు కోట్ల విజయ భాస్కర రెడ్డి
- కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతి వేడుకల్లో మాజీ పీసీసీ అధ్యక్షులు రఘు వీరారెడ్డి
- నంద్యాల డిసిసి అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి



కర్నూల్ -సూర్య వాస్తవం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్లవిజయభాస్కర్ రెడ్డి జయంతి ని కర్నూల్ లో ఉన్న కిసాన్ ఘాట్ లో సి డబ్ల్యూ సి మెంబర్, మాజీ మంత్రి ఒ మాజీ పీసీసీ అధ్యక్షులు రఘు వీరారెడ్డి ఏఐసీసీ మెంబర్ లక్ష్మీ నరసింహా నంద్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి మరియు డోన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డిపదవులకే వన్నె తెచ్చి నీతికి నిజాయితీకి మారుపేరుగా నిలచి మచ్చలేని మనిషిగా పేరొంది జీవితాంతం రైతాంగ సంక్షేమం కొరకు పరితపించి పల్లె,పల్లెకు సాగు నీరు త్రాగు నీరు అందించి సీమ అపర భగీరథుడు గా పేరు గాంచి తెలుగువారి ప్రజల మనసుల్లో నిలిచారని ఆంధ్రరాష్ట్ర ప్రజలకు సుపరిచితులు. దేశ రాజకీయాలలో తనదైన శైలి లో ముద్ర వేసుకున్న నేత గా నిలిచి, పేదవారి ఎదుగుదలే సమాజ నిర్మాణానికి నాంది అని భావించి వారి ఎదుగుదలకు నిరంతరం కృషి చేసిన మహా మనిషి అని కొనియాడారు ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆ కుటుంబాలకు పెద్దకొడుకు లా నిలిచారు ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్, పాణ్యం నియోజకవర్గం ఇంచార్జి లక్ష్మి నరసింహ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఒ డోన్ నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి నంద్యాల జిల్లా స్పోక్స్ పర్సన్ ఎమ్. జయరాముడు, డిసిసి కార్యదర్శి ఆర్.గోపినాథ రావు,బనగానపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బాల పుల్లయ్య,ప్యాపీలి మండల అధ్యక్షులు శనగల మహేంద్ర నాయుడు,కుమార్.సీనియర్ నాయకులు దీవన్న,వెంకటేష్, సి. నాగరాజు, మల్లికార్జున, అప్పన్న, ఎస్. కృష్ణ, ఎస్ హుస్సేన్ వలి, మధు, కంభగిరి తదితరులు పాల్గొన్నారు.

# స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించవద్దు..

(మొదటిపేజీ తరువాయి)

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ విద్యార్థులు లేఖ రాశారు. నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నామని వారు తమ లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీఐ చైర్మన్ తీరును విమర్శించారు. ఇది దేశంలో శక్తిమంతమైన వ్యవస్థలతో విభేదించే స్వేచ్ఛకు సంబంధించిన అంశమని విద్యార్థులు పేర్కొన్నారు. తమ వృత్తి జీవితంపై భయం లేకుండా అధికారులతో విభేదించే స్వేచ్ఛ ఉండాలని అన్నారు.

నల్సార్ విద్యార్థులు స్ఫూర్తివంతమైన ధైర్యసాహసాలు, నైతిక నిబద్ధత కన బరిచారని ప్రశంసించారు. వారికి బేషరతుగా సంఘీభావం తెలుపుతున్నామని అన్నారు.

# తాడిపత్రిలో మళ్లీ ఉద్రిక్తత...,!

**- వైసీపీ నేతలు-జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య వాగ్వాదం**



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ నేత సంజీవరెడ్డి కుమారుడి వివాహ వేడుకకు జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి సోదరుడు శ్రీరామ్‌రెడ్డిని చూసిన జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. శ్రీరామ్‌రెడ్డి ఫంక్షన్ హాల్ నుంచి బయటకు వెళ్లాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించడంతో, తామెందుకు బయటకు వెళ్లాలని వైసీపీ నేత కందిగోపుల మురళి ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో కందిగోపుల మురళి, జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనతో వివాహ వేడుక వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఉత్తమ సేవలందించిన విద్యుత్ అధికారి

**- లైన్ మాన్ మూలి హరినాథరెడ్డికి అవార్డు ప్రదానం**



**పామిడి –సూర్య వాస్తవం:** పామిడి మండలం వ్యాప్తంగా విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న వారు జిల్లా విద్యుత్ శాఖ అధికారి(ఎస్ఇ) చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సేవలు పెంచిన ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేయడం ఆనవా యితీలో భాగంగా గుత్తి డివిజన్ విద్యుత్ శాఖకు గణనీయంగా ఉత్తమ ఉద్యోగులుగా 56 మంది అవార్డులు సాధించడం అభినందనీయమని ప్రజలు ప్రశంస జల్లులు కురిపిస్తున్నారు. ఇందులో భాగంగా పామిడి మండలంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు అవార్డులు అందుకున్నారు. వీరిలో ఒకరు జిల్లాస్థాయి ఉత్తమ ఉద్యోగిగా, ముగ్గురు డివిజన్ స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ఇందులో పామిడి మండలం సొరకాయలపేట గ్రామనివాసి లైన్మెన్ మూలి.హరినాథ్ రెడ్డి ఎంపికై జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఇ) చేతులు మీదుగా ప్రశంసాపత్రం అవార్డు అందుకున్నందుకు సొరకాయలపేట గ్రామస్తులు, తోటి ఉద్యోగస్తులు, బంధువులు స్నేహితులు మూలి.హరినాథ్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారి పి పద్మనాభపిళ్ళై, మండల విద్యుత్ శాఖ అధికారి మధుసూదనరావు, ఉత్తమ సేవా ఉద్యోగులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలను డివిజన్, మండల అధికారులు, రోడ్డు సిబ్బంది బంధువులు స్నేహితులు మండల ప్రజలు అభినందించారు.

# పలు వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

**- నూతన వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే**

**- దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్ష**

**- నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ నాయకులు**



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన పలు వివాహ శుభ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవీ రమణ, జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ఇప్పేరు ఎంపీటీసీ రమేష్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వై. విశ్వేశ్వరరెడ్డి నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం వధూ వరులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం మిషన్ క్లీన్...!

**- డిస్కవర్ అనిల్ ఆధ్వర్యంలో మహత్తర కార్యక్రమాలు....**

- హెచ్‌ఎల్‌సీ కాలనీ కాలువలో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు
- రెండో విడతలో 6 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ
- 140 మందికి పైగా పౌరులు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనడం
- ప్రజలతో కలిసి శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్





**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** పర్యావరణ పరిరక్షణ, నగర పరిశుభ్రత లక్ష్యంగా డిస్కవర్ అనిల్ చేపట్టిన 'ప్రాజెక్ట్ అనంతపురం మిషన్ క్లీన్ (ఏఎంసి)' రెండో విడత హెచ్‌ఎల్‌సీ కాలనీ కాలువ వద్ద విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 6,000 కిలోలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. డిస్కవర్ అనంతపురం, రోటరీ క్లబ్ అనంతపురం, ఆర్యన్ స్కూల్, అనంతపురం యూత్ ఫోరం, ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో, డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకులు ఏ.జీ. అనిల్ కుమార్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో నిర్వహించిన తొలి విడతలో సుమారు 5,000 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించగా, రెండో విడతలో మరో 6,000 కిలోలకు పైగా వ్యర్థాలను తొలగించారు. దీంతో రెండు విడతల్లో కలిపి 11,000 కిలోలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించినట్లయింది.

**140 మందికి పైగా పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో 12 ఏళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల సీనియర్ సిటిజన్ల వరకు 140 మందికి పైగా పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, సీనియర్ పౌరులు, స్వచ్ఛంద కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కాలువలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

**ప్రజలతో కలిసి మున్సిపల్ కమిషనర్**

కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్, అధికారుల బృందం స్వయంగా హాజరై పారిశుద్ధ్య పనుల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు సమిష్టిగా పనిచేస్తే నగర పరిశుభ్రతలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

**ప్రజా ఉద్యమంగా 'మిషన్ క్లీన్'**

'అనంతపురం మిషన్ క్లీన్' కేవలం శుభ్రత కార్యక్రమాలకు పరిమితం కాకుండా, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, యువత, ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేసి నగరంలోని పర్యావరణ, పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపే ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పౌరులు, విద్యార్థులు, వాలంటీర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, భాగస్వామ్య సంస్థలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజలు--అధికారులు కలిసి అడుగేస్తే అనంతపురాన్ని పరిశుభ్రమైన, పచ్చని నగరంగా మార్చడం సాధ్యమే" అని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఫేక్ న్యూస్‌కు కేంద్రం 'స్పీడ్ బ్రేక్'..!

- యువతను ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నఫేక్ న్యూస్
- ఫేక్ న్యూస్‌పై కేంద్రం 'క్యూఆర్‌టీ' వార్...!
- తప్పుడు ప్రచారానికి చెక్.. కేంద్రం కఠిన చర్యలు...!
- ఇప్పటికే మూడు శాఖల్లో ప్రత్యేక బృందాల ఏర్పాటు...!



**అనంతపురం టౌన్– సూర్య వాస్తవం :** సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు నిమిషాల వ్యవధి లోనే వైరల్ అవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ విధానాలు, పథకాలు, కార్యక్రమాలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించి, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేసేందుకు అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రత్యేక క్విక్ రెస్పాన్స్ టీమ్స్ (క్యూఆర్‌టీలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలతో సోషల్ మీడియా వేదికగా నిర్మాణాత్మకంగా అనుసంధానం కావడంతో పాటు పుకార్లు, ఫేక్ కంటెంట్, తప్పుదోవ పట్టించే సమాచారంపై తక్షణమే స్పందించడం ఈ బృందాల ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. ఇప్పటికే విద్యుత్, వ్యవసాయం, వాణిజ్య శాఖల్లో ప్రత్యేక క్యూఆర్‌టీలు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

**రెండు గంటల్లోనే స్పందన**

ఏదైనా తప్పుడు సమాచారం గుర్తించిన తర్వాత రెండు గంటల్లోనే క్యూఆర్‌టీలు అధికారికంగా స్పందించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయనున్నాయి. ఇందు కోసం ఆయా శాఖల సోషల్, డిజిటల్ మీడియా బృందాలు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన న్యూ మీడియా విభాగంతో సమన్వయం చేసుకోనున్నాయి. సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న పోస్టులు, ప్రజల్లో ఆందోళన కలిగించే అంశాలు, సున్నితమైన విధానపరమైన విషయాలు, చట్టపరమైన సమస్యలు, సమన్వయంతో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను క్యూఆర్‌టీలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నాయి. తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖలు సకాలంలో స్పందించి ప్రజలకు వాస్తవాలను చేరవేయడంలో క్యూఆర్‌టీలు కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## ఆత్మకూరులో దారి దోపిడీ..

# గొర్రెల చోరీకి యత్నం...!

- నలుగురు దుండగుల హల్‌చల్...
- కొరియర్ డ్రైవర్ నుంచి రూ.20 వేల నగదు లాక్కొని, బొలెరో వాహనం అపహరణ...
- గొర్రెల కాపరుల అప్రమత్తతతో వాహనం వదిలి పరారీ..
- ముగ్గురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం...?

**అనంతపురం రూరల్ – సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలంలోని పంపనూరు, వై.కొత్తపల్లి గ్రామాల పరిధిలో నలుగురు దుండగులు దారి దోపిడీకి పాల్పడి, అనంతరం గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నలుగురు వ్యక్తులు పంపనూరు సమీపంలో ఓ కొరియర్ డ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న రూ.20 వేల నగదును లాక్కున్నారు. అనంతరం వడ్డుపల్లి సమీపంలోని టోల్‌గేట్ వద్దకు చేరుకుని, అనంతపురం నుంచి కల్యాణదుర్గం మండలం మానిరేవుకు వెళ్తున్న ఓబులేసును వాహనం నుంచి కిందికి లాగి, అతని బొలెరో వాహనాన్ని అపహరిం చినట్లు సమాచారం. అక్కడి నుంచి వై.కొత్తపల్లి గ్రామ సమీపంలోని గొర్రెల షెడ్డు వద్దకు వెళ్లి గొర్రెలను బొలెరోలో ఎక్కించుకునేందుకు ప్రయత్నించారు. గొర్రెలకు కాపలాగా ఉన్న వ్యక్తి చోరీని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, దుండగులు అతడిపై రాళ్లతో దాడి చేశారు. దీంతో అతడు అక్కడి నుంచి తప్పించుకుని గొర్రెల కాపరులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న గొర్రెల కాపరులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బొలెరో వాహనాన్ని అక్కడే వదిలివెళ్లారు. అనంతరం బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

**- టిడిపి నాయకులు**



**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** శింగనమల నియోజకవర్గంలో ఈ నెల 22న మన ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు  పర్యటన ఉన్నందున కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఆదివారం పర్యటన ఏర్పాట్ల పై శింగనమల నియోజకవర్గ పరిశీలకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి  టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు సీనియర్ టిడిపి నాయకులు ఆలం నరసానాయుడు సీనియర్ టిడిపి నాయకులు కేశవ్ రెడ్డి రామలింగారెడ్డి శ్రీధర్ బాబు  తదితర ముఖ్య టిడిపి నాయకులు సమావేశం అయ్యారు.

## మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం నందు పద్మ విభూష ణ్ డా.మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వుత్సవాలు సందర్భంగా స్థానిక గవ ర్నమెంట్ ఆసుపత్రి సూపర్ఇండెంట్ డా.ఎల్లప్ప మరియు మిత్రబృందం తో అఖిల భారత చిరంజీవి యువత మెగా యూత్ ఫోర్స్ వారి ఆధ్వ ర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వ హించడం జరుగుతున్నది.ఈ కార్య క్రమానికి విచ్చేసి రక్తదానం చేసిన ప్ర తి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాద ములు తెలుపుతున్నాము అఖిల భారత చిరంజీవి యువత అనంత పురం జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురే ష్,చిన్న వెంకటేశులు, మెగా యూత్ ఫోర్స్ అనంతపురం జిల్లా జాయిం ట్ కన్వీనర్ బోయగడ్డబ్రహ్మయ్య,తి రుమలేష్, మెగా యూత్ ఫోర్స్ టౌన్ కన్వీనర్ అలివేలు ధరణి కుమార్, జాయింట్ కన్వీనర్ మిద్దె ఓబులేష్,  కోకన్వీనర్ రాజు,డిజిటల్ మీడియా ఈశ్వర్, రోహిత్, రఘురంగా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దత్త పాదుక క్షేత్రంలో గీతా జ్ఞాన యజ్ఞము 3వ అధ్యయనం  సంపూర్ణం



**పామిడి - సూర్య వాస్తవం :** అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రము 8 నుండి ఆగస్టు 16 వరకు తొమ్మిది రోజులు ప్రతిరోజు సాయంత్రం 6:30 నుండి 8 గంటల వరకు  పూజ్య గురువులు పరమపూజ్యులు గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో పూజ్యశ్రీ బాల స్వామీజీ వారి అనుమతితో పామిడి .శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం. నందు అనంతపురం చిన్మాయ మిషన్ స్వామి  ఆత్మవిదానంద సరస్వతి, భగవద్గీత 3 వ అధ్యాయం (కర్మయోగము)పై గీతా జ్ఞాన యజ్ఞము భక్తి శ్రద్ధలతో నిర్వహించబడింది భగవద్గీత దివ్యజ్ఞానాన్ని శ్రవణం చేసి, జీవన విధానాన్ని ఆధ్యాత్మిక దిశగా మలుచుకొనే ఈ పవిత్ర అవకాశాన్ని  వందలాది మంది సద్వినియోగం చేసుకున్నారు భక్తాతలందరూ భగవద్గీత మూడవ అధ్యాయం  తెలుసుకొని గురువుగారిని సన్మానించడం జరిగింది దత్త పాదుక క్షేత్రం ఆలయ కమిటీ సభ్యులు భక్తాదులకు అందరికీ  9 రోజులు  ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## నడక దారిలో ధూమపానం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు

**తిరుపతి - సూర్య వాస్తవం :**అలిపిరి నడక మార్గంలో నియమ నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి ధూమపానం చేసినట్లు టీటీడీ దృష్టికి వచ్చింది. సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరుగుతుంది. నిబంధనల ప్రకారం తిరుమల, అలిపిరి, శ్రీవారి మెట్టు, ఇతర టీటీడీకి చెందిన ప్రాంతాల్లో మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు సేవించడం పూర్తిగా నిషేధం. ఈ విషయం తెలిసినప్పటికీ సదరు భక్తుడు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా నడకమార్గంలో ధూమపానం చేయడం హేయమైన చర్య. ఇలా టీటీడీ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేయడమైనది. అదేవిధంగా  తనిఖీలలో నిర్లక్ష్యం వహించిన సెక్యూరిటీ సిబ్బంది పై తగు క్రమశిక్షణ చర్యలు  తీసుకోవడం జరుగుతుంది

# ఎన్ లియాకత్ అలీ సేవలు వెలకట్టలేనివి

- ప్రధానోపాధ్యాయులు ఎన్. లియాఖత్ అలీ అధ్యక్షతన కార్యక్రమం
- పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలకు సహకారం అందించిన హెచ్ఎం
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత
- విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక ప్రోత్సాహం
- ప్రధానోపాధ్యాయులు ఎన్. లియాఖత్ అలీకు ఘన సన్మానం
- ఏటా ప్రతిభావంతులను ప్రోత్సహిస్తామన్న 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



**కదిరి - సూర్య వాస్తవం :** స్థానిక వేమన బాలుర ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎన్. లియాఖత్ అలీ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. 1973-74లో ఇదే పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హాజరై, గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. మొదటి ర్యాంక్ సాధించిన రెడ్డిపల్లి అఫ్జల్‌కు మెమెంటోతో పాటు రూ.5 వేల నగదు, రెండో ర్యాంక్ సాధించిన జి. సూర్య ప్రకాష్‌కు మెమెంటోతో పాటు రూ.3 వేల నగదు, మూడో ర్యాంక్ సాధించిన షేక్ షానవాజ్‌కు మెమెంటోతో పాటు రూ.2 వేల నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి హాజీ అత్తార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ, తమ మిత్ర బృందం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంవత్సరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థులు సి. రమేష్ బాబు, కాటం వీరనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఒకే సి. సెక్షన్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు మూడు ర్యాంకులు సాధించడంలో విద్యార్థుల కృషితో పాటు ఉపాధ్యాయుల ప్రోత్సాహం కూడా ఎంతో ఉందని పేర్కొంటూ ఆ సెక్షన్ ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. లియాఖత్ అలీను కూడా పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హాజీ అత్తార్ మహబూబ్ బాషా, టి. శ్రీనివాసులు, యస్.యం.డి. బాషా, టి.రామలింగయ్య, కె.అజ్మతుల్లా ఖాన్, సి.రమేష్, కాటం వీరనారాయణ, యం.ఎన్. అల్లాబకష్, ఎల్. రెడ్డి, మిలటరీ మగ్దూమ్ తదితరులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కదిరి పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**- కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే**



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ  మండపం నందు  లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో ఆదివారం  ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు శంకర కంటి ఆసుపత్రి ( బెంగుళూరు ) కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాస్ర మాట్లాడుతూ కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్,ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పత్రా శ్రీనివాసులు మాట్లాడుతూ..... కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర జాస్ర కంటి వైద్య శిబిరానికి  వచ్చిన 120 మందిని పరీక్షించి అందులో 57 మందిని. కంటి ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డిస్ట్రిక్ చైర్ పర్సన్స్  డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ  జయరాం రావు కమిత్కర్ రఘువీర్ రావు మానవ హక్కుల కమిషన్,ఉపర్యావరణ పరిరక్షణ దక్షణ భారత దేశ సెక్రటరీ ఆవుల ప్రసాద్, లయన్స్ క్లబ్ కోశాధికారి డి. షేక్షావలి, ఉపకార్యదర్శి ముం దే షేక్షావలి. క్లబ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యులు గంగ శేఖర్,  ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్ కుమార్,,డైరెక్టర్స్  పత్ర రాకేష్, నల్లయ్య  శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ రాకేష్ శంకర హాస్పిటల్ సిబ్బంది  లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# రామన్ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి
- పేదరికం, అసమానతలు, నిరుద్యోగం నుంచి విముక్తి దిశగా అడుగులు
- విద్యార్థుల్లో దేశభక్తి, బాధ్యతా భావాన్ని పెంపొందించాలి: తిరుమలాదేవి
- చిన్నారులతో కేక్ కట్ చేయించిన ప్రధానోపాధ్యాయులు





**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం:** అనంతపురం నగరంలోని రామన్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పాఠశాల యాజమాన్యం, ప్రధానో పాధ్యా యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళు లర్పించారు.
కార్యక్రమంలో తిరుమలాదేవి మాట్లాడుతూ.. భారతదేశం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటం చేసి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సాధించిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. స్వాతంత్ర్యం సాధించినప్పటికీ సమాజంలో ఉన్న పేదరికం, అసమానతలు, నిరుద్యోగం వంటి సమస్యల నుంచి విముక్తి సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతా భావాలను పెంపొందించాలని తెలిపారు.అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రధానోపాధ్యాయులు చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్వీపర్ రాముడు నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం :** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శనానికి సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి వచ్చిన భక్తురాలు సావిత్రమ్మ ఆలయ ప్రాంగణంలో పర్సును పోగొట్టుకున్నది. ప్రాంగణంలో లోనే స్వీపర్ పనిచేస్తున్న రాముడికి పర్సు దొరకడంతో వెంటనే మఠం కార్యాలయం లో అప్పగించాడు. పర్సు పోగొట్టుకున్న బాధితురాలు సావిత్రమ్మకు మఠం యాజమాన్యం అప్పగించారు. పర్సును అందజేసిన మఠం సిబ్బంది స్వీపర్ రాముడు నిజాయితీని పలువురు భక్తులు, మఠం సిబ్బంది అభినందించారు.

## అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు దరఖాస్తుల ఆహ్వానం



**చిట్వేలి – సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా చిట్వేలి మండలం ప్రభుత్వ ఆదేశాల మేరకు, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి సూచనలతో చిట్వేల్ మండలంలో సెప్టెంబర్ 2026 నుండి ఏప్రిల్ 2007 వరకు ఎనిమిది నెలల కాలానికి గానూ మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 41 పోస్టులు ఉన్నత పాఠశాలలో 4 పోస్ట్ లకు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు నుండి ఈ నెల 16 నుండి 21 వరకు దరఖాస్తుల ఆహ్వానించడమైనదని మండల విద్యాశాఖ అధికారులు ఖాజా మొహిద్దీన్ మరియు ఈశ్వరయ్య లు తెలియ జేశారు. అప్లికేషన్స్ మండల విద్యాశాఖ అధికారి చిట్వేల్ కార్యాలయంలో సమర్పించాలని తెలియజేశారు. అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లకు ఎస్జీటీ పోస్ట్‌కు నెలకు పదివేల రూపాయలు, స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ కు నెలకు 12,500 రూపాయలు గౌరవ వేతనం చెల్లించబడును. ఎస్జిటి పోస్టుకు డిఎడ్, స్కూల్ అసిస్టెంట్ కు బిఈడి చేసిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుంది అని తెలిపారు

## భారతీయ జనతా పార్టీకి రుణపడి ఉంటా

**– బిజెపి అన్నమయ్య జిల్లా కార్యదర్శి నిర్మల్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం:** భారతీయ జనతా పార్టీకి రుణపడి ఉంటానని అన్నమయ్య జిల్లా బిజెపి కార్యదర్శి నిర్మల్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలోఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మరియు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం అన్నమయ్య జిల్లా బిజెపి కార్యదర్శిగా ప్రకటించడం సంతోషంగా ఉందని కావునఈ జిల్లా కమిటీలో నాకు సహకరించిన బిజెపి రాష్ట్ర పార్టీకి మరియు జిల్లా పార్టీకి, నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు అలాగే నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు అందరికీ మరొక్కసారి రాయచోటి బిజెపి నాయకుల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## ఉచిత మెడికల్ క్యాంపు

**చాపాడు – సూర్య వాస్తవం:** రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు మరియు రోటరీ ఐ హాస్పిటల్ ప్రొద్దుటూరు వారి ఆధ్వర్యంలో చాపాడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంప్ ఆదివారం పేద ప్రజల సహాయార్థం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ ప్రెసిడెంట్ కొవ్వూరు రమేష్ రెడ్డి ఆర్థిక సహకారము రొటేరియన్ మాకం సురేష్, నరసింహారెడ్డి ఉచిత మందులను అందజేయడం జరిగింది. రోటరీ ఐ హాస్పిటల్ అధ్యక్షులు పి డి జి ఎం వి ఎన్ ప్రభు మరియు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కార్యక్రమానికి అధ్యక్షులు గా మార్గదర్శకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఐపిడి జి సాధు గోపాలకృష్ణ, రొటేరియన్ కోట శివకుమార్, రోటరీ ఐ హాస్పిటల్ సెక్రెటరీ జాకీర్ అహ్మద్, క్లబ్ సెక్రటరీ గండ్లూరు శ్రీధర్ శర్మ, వైస్ ప్రెసిడెంట్ కే రవి కుమార్ రెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్స్ బాల సూర్యరావు, గుర్రం రామకృష్ణ, మురుకుటి సూర్యనారాయణ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి, అగ్గారపు వెంకటేశ్వర్లు, శ్రీరాముల వెంకటేశ్వర్లు, చిరెడ్డి మధుసూదన్ రెడ్డి, దొంతు బాలాజీ, ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ లక్ష్మీ ప్రసన్న, ఫాస్ట్ ప్రెసిడెంట్ భారతి ఇతర సభ్యులు ఊరి పెద్దలు రాజోలి మల్లికార్జున రెడ్డి నారపరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి గూడూరు బాలుడు గూడూరు భార్గవ తదితరులు పాల్గొన్నారు గ్రామ పెద్దలు పాఠశాల స్థల దాతలు స్కూలు యాజమాన్యం వారు పాల్గొన్నారు 150 మంది ప్రజలు ఈ ఈ క్యాంపు ను ఉపయోగించుకున్నారు.



# యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించం

**- ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పాటించాలి**
**- నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: సోషలిస్ట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ**




**కడప – సూర్య వాస్తవం :** రాష్ట్రంలోని యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ఉద్యోగ నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని సోషలిస్ట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. యువత భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించింది. కడపలో ఆదివారం జరిగిన శాఖ రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులు, యువత సమస్యలు, ఉద్యోగ నియామకాలు, నిరుద్యోగం, ఉద్యోగుల డిమాండ్లు, ప్రజాస్వామ్య హక్కులపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి పచ్చారం నాగరాజు, సునీల్ కుమార్ అధ్యక్షతలి వహించారు. జవీూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమణయ్య ముఖ్య అతిథిగా హాజరైలి ప్రసంగించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ. అశోక్‌లి , కరుణాకర్, నరసింహులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవీూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ముఖ్య అతిథి గుజ్జుల రమణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. చదువులు పూర్తిచేసుకుని ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న యువతకు తగిన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో ఎక్కడైనా అనుమానాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయడంతో పాటు అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే యువత గొంతును అణచివేయడం కాకుండా వారితో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాలని అన్నారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ. అశోక్ మాట్లాడుతూ యువత సమస్యలు కేవలం ఎన్నికల సమయంలో ప్రస్తావించే అంశాలు కాదని, అవి రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలకమైన సమస్యలని అన్నారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతలో నమ్మకం కలిగించే విధంగా ప్రభుత్వం నియామక ప్రక్రియలను నిర్వహించాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షలు, మూల్యాంకనం, ఫలితాలు, నియామకాలు అన్నింటిలోనూ పారదర్శకత ఉండాలని కోరారు. ఋజా అభ్యర్థుల సమస్యలు, గ్రూప్–1 పరీక్షకు సంబంధించిన అంశాలు, ఉద్యోగుల పిఆర్‌సి ఐఆర్ డిమాండ్లు, జూనియర్ డాక్టర్ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం పోరాడుతున్న యువత, విద్యార్థులు, ఉద్యోగులపై అణచివేత ధోరణి కాకుండా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. యువత సమస్యల పరిష్కారం కోసం శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను నిర్మిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో మెగా ఋజా నియామక ప్రక్రియపై ప్రధానంగా చర్చ జరిగింది. ఉద్యోగం కోసం సంవత్సరాలుగా సిద్ధమవుతున్న అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని శాఖ డిమాండ్ చేసింది. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు చేస్తున్న అభ్యర్థుల ఆందోళనలను అర్థం చేసుకోవాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న నిరసనలను అణచివేయడం కాకుండా వారితో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కోరింది. నిరుద్యోగ యువతను సమస్యగా కాకుండా వారి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యతగా ప్రభుత్వం చూడాలని పేర్కొంది. ఏపీపీయస్‌గ్రూప్–1 పరీక్ష మూల్యాంకన ప్రక్రియపై నివేదికలో ప్రస్తావించినట్లు వెలువడిన అవకతవకలు, విధి విధానాలకు సంబంధించిన అంశాలపైనా సమావేశం చర్చించింది. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలపై అభ్యర్థులకు నమ్మకం ఉండటం అత్యంత ముఖ్యమని, అందుకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని కోరింది. అభ్యర్థుల్లో ఉన్న అనుమానాలను పూర్తిగా నివృత్తి చేయాలని, విచారణలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అదే సమయంలో ఎలాంటి తప్పు చేయని అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పిఆర్‌సి , సమస్యలపై కూడా సమావేశంలో చర్చించారు. ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శాఖ కోరింది. ఉద్యోగులు సంతృప్తిగా పనిచేసే పరిస్థితులు కల్పించడం ద్వారా మాత్రమే ప్రభుత్వ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొంది. అలాగే జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న స్టైఫండ్ తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం––వైద్యుల మధ్య చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలని కోరింది. ప్రజా సమస్యలపై విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు నిర్వహించే ప్రజాస్వామ్య నిరసనలను ప్రభుత్వం గౌరవించాలని సమావేశం స్పష్టం చేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కులని పేర్కొంది. ప్రజా జీవితానికి అంతరాయం కలగకుండా నిరసనలు నిర్వహించాల్సిన బాధ్యత ఉద్యమకారులపై ఉన్నప్పటికీ, సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై కూడా ఉందని తెలిపింది.

రాష్ట్రంలో యువతకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని శాఖ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని, నోటిఫికేషన్లు జారీ చేసిన తర్వాత పరీక్షలు, ఫలితాలు, నియామకాలను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసే విధానం తీసుకురావాలని కోరింది. నిరుద్యోగ యువతలో పెరుగుతున్న ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకుని ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశం నిర్ణయించింది. జిల్లా స్థాయిలో యువతతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చోట ప్రజాస్వామ్య ఉద్యమాలను చేపట్టాలని నిర్ణయించారు. విద్య, ఉపాధి, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై శాఖ తన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు హామీ ఇవ్వాలని, నిరుద్యోగులు, ఉద్యోగులు, జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించాలని శాఖ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కును కాపాడుతూ, యువతను భాగస్వాములుగా చేసుకుని పాలన సాగించాలని కోరింది. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలను కొనసాగిస్తామని రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది.

# వర్ధన్స్ హాస్పిటల్ ప్రారంభం

**ప్రొద్దుటూరు–సూర్యవాస్తవం:** పట్టణంలోని శ్రీరాముల పేటలో ఉన్న డాక్టర్ ప్రసాద్ రెడ్డి కాంప్లెక్స్ లో ఆదివారం వర్ధన్స్ క్లినిక్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వేద వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వర్ధన్స్ హెల్త్ అండ్ సైన్స్ హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకే వేదికపై నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వివిధ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. జనరల్ కన్సల్టేషన్‌తో పాటు డయాగ్నస్టిక్ సెంటర్, సైకియాట్రిక్ సెంటర్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు అందించే విధంగా క్లినిక్‌ను తీర్చిదిద్దినట్లు తెలిపారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ సాయి వాసంతి మాట్లాడుతూ మధురైలో సైకియాట్రీ వైద్య విద్యను అభ్యసించినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు ప్రజలకు మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలను అందించేందుకు క్లినిక్‌లో సైకియాట్రిక్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆధునిక వైద్య సేవలను అందించడమే



తమ ప్రధాన ఉద్దేశమని డాక్టర్ వేదా వర్ధన్ రెడ్డి తెలిపారు. క్లినిక్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు ఈ.వి. సుధాకర్ రెడ్డి, బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, డాక్టర్ నాగ దస్తగిరి రెడ్డి , డాక్టర్ వేద వర్ధన్ రెడ్డి తండ్రి రామేశ్వర రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న చిత్రం 'ఇరుముడి'

సినిమా నుంచి 'మల్లెపూల పల్లకి' అనే తొలి పాట విడుదల
శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ
జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం
ఆగస్టు 21న థియేటర్లలోకి రానున్న 'ఇరుముడి'



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మొదటి పాట విడుదలైంది. 'మల్లెపూల పల్లకి' అంటూ సాగే ఈ పాట లిరికల్ వీడియోను చిత్ర బృందం ఆదివారం విడుదల చేసింది. హైదరాబాదులో ఆదివారం ఏర్పాటు చేసిన గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఈ సాంగ్ ను ఆవిష్కరించారు. విడుదలైన కొద్దిసేపటికే ఈ పాట సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ 'మల్లెపూల పల్లకి' పాటకు చౌడం శ్రీనివాసరావు సాహిత్యం అందించారు. గాయకుడు డప్పు శ్రీను తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. రవితేజ ఎనర్జీకి తగినట్టుగా జీవీ ప్రకాశ్ అందించిన సంగీతం, క్యాచీ ట్యూన్ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రేమకథా చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ, మాస్ ఇమేజ్ ఉన్న రవితేజ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై సినీ వర్గాల్లో మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటించారు. బేబీ నక్షత్ర కీలక పాత్ర పోషించింది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ-సిరీస్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం విశేషం. ఏకేడీ స్టూడియోస్, యూవీ సంస్థలు కూడా నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నాయి.ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 'ఇరుముడి' చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విడుదలైన తొలి పాట సినిమా ప్రమోషన్లకు మంచి ఊపునిచ్చింది.

# వయసు తగ్గుతున్న హీరోలు ఇద్దరే..

# ఒకరు సూర్య, మరొకరు మహేశ్: త్రివిక్రమ్



హీరో సూర్య ప్రధాన పాత్రలో నటించిన తాజా కుటుంబ కథా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' విజయోత్సవ వేడుకలు శనివారం రాత్రి హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి, హీరో సూర్యపై ప్రశంసల జల్లు కురిపించాడు.ఈ వేడుకలో సూర్య మాట్లాడుతూ.. "కుటుంబ కథా చిత్రాల ప్రాముఖ్యతను ఈ సినిమాకు లభిస్తున్న ఆదరణ మరోసారి నిరూపించింది. తొలి రోజుతో పోలిస్తే వసూళ్లు రెట్టింపు కావడం సంతోషకరం. తెలుగు రాష్ట్రాల్లో అదనపు షోలు కూడా ప్రదర్శిస్తున్నారు. ఇంతటి అద్భుతమైన కథను, పాత్రలను రూపొందించిన దర్శకుడు వెంకీ అట్లూరికి నా ప్రత్యేక ధన్యవాదాలు" అని పేర్కొన్నాడు.అనంతరం త్రివిక్రమ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "భారతీయ చిత్ర పరిశ్రమలో వయసు తగ్గుతున్నట్లు కనిపించే అరుదైన కథానాయకులు ఇద్దరే ఉన్నారు. ఒకరు సూర్య, మరొకరు మహేశ్ బాబు. సూర్యతో సినిమా చేయాలని నా భార్య ఎప్పటి నుంచో కోరుతోంది. త్వరలోనే ఆయనతో కలిసి పని చేస్తానని ఆశిస్తున్నాను. సూర్య, కార్తీ ఇప్పుడు భాషా, ప్రాంతీయ భేదాలు దాటి తెలుగు ప్రేక్షకులకు ఎంతో చేరువయ్యారు" అని కొనియాడాడు.ఈ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించగా, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మామితా బైజు కథానాయికగా నటించగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషించారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. నటీనటులు, సాంకేతిక బృందం నుంచి అద్భుతమైన సహకారం లభించిందని, సూర్య తన నటనా ప్రతిభతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారని ప్రశంసించాడు. ఈ కార్యక్రమంలో రవీనా టాండన్, సునీల్ రెడ్డి, వైవా హర్ష, నిర్మాత నాగవంశీ తదితరులు పాల్గొన్నారు.



# నాకు అండగా ఆ ఇద్దరు హీరోలు: అనుపమ పరమేశ్వరన్

**తన కష్టకాలంలో ఇద్దరు హీరోలు అండగా నిలుస్తారన్న అనుపమ**
**బాధలో ఉన్నప్పుడు దుల్కర్ సల్మాన్ నుంచి మెసేజ్ వస్తుందని వెల్లడి**
**దుల్కర్ తర్వాత రామ్ పోతినేనిని ఎక్కువగా విశ్వసిస్తానని స్పష్టం**
**మాజీ ప్రియుడి నుంచి ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి ప్రస్తావన**
**దుల్కర్‌తో కలిసి గతంలో మలయాళ చిత్రంలో నటించిన అనుపమ**

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు.తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమోంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే.ఇదే సందర్భంగా, తన గత ప్రేమ సంబంధంలో ఎదుర్కొన్న మానసిక వేధింపుల (నార్సిసిస్టిక్ అబ్యూజ్) గురించి కూడా ఆమె ప్రస్తావించారు. అలాంటి వ్యక్తులు ఇతరులను ఎప్పుడూ తమ నియంత్రణలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారని, ఇది చాలా నిశ్శబ్దంగా జరిగే వేధింపు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



# క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ సంచలనాలు..

# ఐదు చిరస్మరణీయ విజయాలు ఇవే!



క్రికెట్ ప్రపంచంలో మరో సంచలనం నమోదైంది. పసికూనగా ముద్రపడిన బంగ్లాదేశ్ జట్టు, బలమైన ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపైనే మట్టికరిపించి చారిత్రక టెస్టు విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం డార్విన్‌లో ముగిసిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లోని తొలి టెస్టులో, నజ్ముల్ హొస్సేన్ శాంటో నేతృత్వంలోని బంగ్లా పులులు అద్భుతం చేశారు. ఈ విజయం బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. కీలక ఫాస్ట్ బౌలర్లు నహిద్ రాణా, షోరిఫుల్ ఇస్లాం గాయాలతో దూరమైనప్పటికీ, పూర్తిస్థాయి ఆస్ట్రేలియా జట్టును ఓడించడం వారి పోరాట పటిమకు నిదర్శనం. "అన్ని ఫార్మాట్లలోనూ ఇదే మా అతిపెద్ద విజయం" అని కెప్టెన్ శాంటో వ్యాఖ్యానించడం ఈ గెలుపు ప్రాధాన్యతను తెలియజేస్తోంది. ఈ చారిత్రక విజయం నేపథ్యంలో, బంగ్లాదేశ్ క్రికెట్‌లో సాధించిన అతిపెద్ద సంచలన విజయాలను ఒకసారి పరిశీలిద్దాం.

**1. 1999 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై గెలుపు**

బంగ్లాదేశ్ క్రికెట్ గతిని మార్చిన క్షణం ఇది. 1999 వన్డే ప్రపంచకప్‌లో వారు పటిష్ఠమైన పాకిస్థాన్‌ను ఓడించి పెను సంచలనం సృష్టించారు. 1992 ప్రపంచ ఛాంపియన్, 1999 ఫైనలిస్ట్ అయిన పాకిస్థాన్‌ను గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో ఓడించడం ద్వారా, తాము కూడా పెద్ద జట్లను ఓడించగలమని ప్రపంచానికి చాటిచెప్పారు. నార్తాంప్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 9 వికెట్లకు 223 పరుగులు చేసింది. ఇది సాధారణ స్కోరుగానే కనిపించినా, బంతితో ఖలీద్ మహమూద్ మాయ చేశాడు. సయీద్ అన్వర్, షాహిద్ అఫ్రిది, ఇంజమామ్-ఉల్-హక్, సలీమ్ మాలిక్ వంటి మేటి బ్యాటర్లున్న పాక్ జట్టును ఖలీద్ దెబ్బతీశాడు. అఫ్రిది, ఇంజమామ్, సలీమ్‌లను ఔట్ చేసి పాక్ పతనాన్ని శాసించాడు. దీంతో పాకిస్థాన్ 42 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి, ఆ తర్వాత కోలుకోలేక 161 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ చారిత్రక విజయమే 2000 సంవత్సరంలో బంగ్లాదేశ్‌కు ఐసీసీ టెస్టు హోదా (పూర్తి సభ్యత్వం) లభించడానికి మార్గం సుగమం చేసింది.

**2. 2005 నాట్‌వెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియాకు షాక్**

2005లో బంగ్లాదేశ్ మరో చారిత్రక విజయాన్ని అందుకుంది. అప్పట్లో అపజయమన్నదే ఎరుగని ఆస్ట్రేలియా జట్టును నాట్‌వెస్ట్ సిరీస్‌లో ఓడించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. 1999, 2003 ప్రపంచకప్‌లను గెలిచి, ఆడమ్ గిల్‌క్రిస్ట్, మాథ్యూ హేడెన్, రికీ పాంటింగ్, మైఖేల్ క్లార్క్, గ్లెన్ మెక్‌గ్రాత్ వంటి దిగ్గజాలతో నిండిన ఆ జట్టును హబీబుల్ బషర్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ఓడించింది. కార్డిఫ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా, గిల్‌క్రిస్ట్, పాంటింగ్‌లను 9 పరుగులకే కోల్పోయినా, డేమియన్ మార్టిన్ (77), మైఖేల్ క్లార్క్ (54) రాణించడంతో 5 వికెట్లకు 249 పరుగులు చేసింది. అయితే, ఛేదనలో మహ్మద్ అష్రాఫుల్ కేవలం 101 బంతుల్లో 100 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. అతనికి తోడుగా అఫ్తాబ్ అహ్మద్ 13 బంతుల్లో 21 పరుగులు చేయడంతో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించింది. ఆస్ట్రేలియాపై వారికి ఇదే తొలి వన్డే విజయం.

**3. 2007 ప్రపంచకప్‌లో భారత్‌ను ఓడించి సంచలనం**

సౌరవ్ గంగూలీ, వీరేంద్ర సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ వంటి మేటి ఆటగాళ్లతో బలంగా ఉన్న భారత జట్టును 2007 వన్డే ప్రపంచకప్‌లో ఓడించడం బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో మరో మైలురాయి. కరేబియన్‌లో జరిగిన ఈ టోర్నీలో, మష్రఫే మొర్తజా (4 వికెట్లు), అబ్దుర్ రజాక్, మహ్మద్ రఫిక్ (చెరో 3 వికెట్లు) అద్భుతంగా బౌలింగ్ చేయడంతో భారత జట్టు కేవలం 191 పరుగులకే ఆలౌటైంది. అనంతరం, ముష్ఫికర్ రహీమ్ (56 నాటౌట్), షకీబ్ అల్ హసన్ (53) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఈ ఓటమి, ఆ ప్రపంచకప్‌లో భారత జట్టు గ్రూప్ స్టేజ్‌లోనే నిష్క్రమించడానికి ప్రధాన కారణమైంది.

**4. 2022లో న్యూజిలాండ్‌పై చారిత్రక టెస్టు విజయం**

2022లో న్యూజిలాండ్ పర్యటనలో బంగ్లాదేశ్ మరో అద్భుతం చేసింది. మౌంట్ మాంగనూయిలో జరిగిన తొలి టెస్టులో, అప్పటి ప్రపంచ టెస్టు ఛాంపియన్ అయిన న్యూజిలాండ్‌ను వారి సొంత గడ్డపైనే ఓడించింది. సేనా (రాజుచీూ– రాశీబ్ష్త్ర్రాటతీఱఖ్షు, జుఅస్త్రశ్రీఖుఅ, చీవష ముశ్రీఖుఅ ఖఅ ాబర్తీఖుశ్రీఱు) దేశాల్లో బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్టు విజయం. కివీస్ జట్టులో కేన్ విలియమ్సన్ లేనప్పటికీ, టామ్ లాథమ్, రాస్ టేలర్, టిమ్ సౌథీ, నీల్ వాగ్నర్ వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. అంతేకాకుండా, సొంతగడ్డపై వరుసగా 17 టెస్టుల్లో అజేయంగా ఉన్న కివీస్ జైత్రయాత్రకు బంగ్లాదేశ్ బ్రేకులు వేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత కివీస్ 328 పరుగులు చేయగా, బంగ్లాదేశ్ 458 పరుగుల భారీ స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఎబాదత్ హొస్సేన్ 6 వికెట్లతో చెలరేగడంతో కివీస్ 169 పరుగులకే కుప్పకూలింది. అనంతరం, బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది.

**5. డార్విన్‌లో ఆస్ట్రేలియాపై తాజా అద్భుతం**

తాజాగా ఆస్ట్రేలియాపై డార్విన్‌లో సాధించిన విజయం, బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప విజయాలలో ఒకటిగా నిలిచిపోతుంది. జోష్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ వంటి స్టార్ బౌలర్లు, మేటి బ్యాటర్లతో కూడిన పూర్తిస్థాయి ఆసీస్ జట్టును, కీలక పేసర్లు లేకుండా బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఓడించడం అసాధారణం. ఈ మ్యాచ్‌లో రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ హసన్ మహమూద్ 6 వికెట్లతో చెలరేగి ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కట్టడి చేశాడు. అనంతరం, తంజిద్ హసన్ తమీమ్ సెంచరీతో బంగ్లాదేశ్ 426 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కామెరూన్ గ్రీన్ సెంచరీ చేసినా, ఆసీస్ 284 పరుగులకే పరిమితమైంది. కేవలం 57 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించి, క్రికెట్ ప్రపంచంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.



# గాలే టెస్టుపై భారత్ పూర్తి ఆధిపత్యం.. పడిక్కల్ భారీ ఇన్నింగ్స్ తో పటిష్ఠ స్థితి

శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై టీమిండియా పూర్తి పట్టు సాధించింది. యువ ఓపెనర్ దేవదత్ పడిక్కల్ (167) బాదిన అద్భుత శతకానికి, కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) సాధించిన కీలక అర్ధ శతకాలు తోడవడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 460 పరుగుల భారీ స్కోరు చేసింది. వర్షం కారణంగా రెండో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, భారత బ్యాటర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు.వర్షం వల్ల తొలి సెషన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో, రెండో రోజు కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక భారత బ్యాటర్లు వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా పడిక్కల్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ భారీ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి తోడుగా రాహుల్, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌ను శ్రీలంక స్పిన్నర్లు కొంతవరకు కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత 3 వికెట్లు పడగొట్టగా, సీనియర్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య 4 వికెట్లతో రాణించాడు. రెండో కొత్త బంతితో లంక బౌలర్లు పుంజుకొని వరుసగా వికెట్లు తీశారు. రవీంద్ర జడేజా (13)ను నువంత ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు.అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురెల్ దూకుడుగా ఆడాడు. కేవలం 68 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 51 పరుగులు చేసి జట్టు స్కోరును 400 దాటించాడు. అయితే, అర్ధ శతకం పూర్తయిన వెంటనే జయసూర్య బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న కెప్టెన్ ధనంజయ డిసిల్వా అద్భుతమైన డైవింగ్ క్యాచ్ పట్టడంతో జురెల్ వెనుదిరిగాడు. చివర్లో మహమ్మద్ సిరాజ్, మానవ్ సుతార్ (24) వేగంగా పరుగులు జోడించారు.రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 460 పరుగులు చేసింది. క్రీజులో కుల్‌దీప్ యాదవ్ (12), ప్రసిద్ధ్ కృష్ణ (1) ఉన్నారు. కాగా, టీమిండియా తన ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసి, మూడో రోజు ఉదయాన్నే శ్రీలంకను బ్యాటింగ్ కు ఆహ్వానించి, వారి లైనప్ ను ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంది.

## తిరుపతి శ్రీ తాతయ్య గుంట అమ్మవారిని దర్శించుకున్న శ్రీధర్ వర్మ





**తిరుపతి –సూర్యవాస్తవం:** ఎస్వీబీసీ ఛైర్మన్ గా నియమితులైన శ్రీ ధర్ వర్మ ఆదివారం శ్రీ తాతయ్య గుంట అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయం వద్ద పాలక మండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ సాదరంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వచనం పలుకగా, మహేష్ యాదవ్ అమ్మవారి పసుపు కుంకుమ,ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీధర్ వర్మ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి గృహానికి చేరుకుని, మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి శ్రీధర్ వర్మ కు ఆత్మీయంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్వీబీసీ ని ,మరింత అభివృద్ధి చేసి టీటీడీ ఖ్యాతి ని, ఆధ్యాత్మిక సేవలను ప్రపంచం నలుమూలలా విస్తరించాలని, డాలర్స్ దివాకర్ రెడ్డి సూచించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**- నగరపాలక సంస్థ కమిషనర్, ఎం. జయకృష్ణ**



**తిరుపతి –సూర్యవాస్తవం:** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్ట్ 17 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎం.జయకృష్ణ, ఐఏఎస్ తెలియజేశారు. గమనిక: అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## దేశ చరిత్రలోనే ప్రతిపక్షం కానీ ప్రతిపక్షమైన వైసిపి పై టీచర్ల ర్యాలీ సిగ్గుచేటు

**- రవి నాయుడు, శాప్ ఛైర్మన్**

**తిరుపతి –సూర్యవాస్తవం:** డీఎస్సీ పై పదేపదే ఆరోపణలు చేసే వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి జరగనున్న అసెంబ్లీ సమావేశానికి హాజరైవిద్యార్థులకు సంబంధించిన డీఎస్సీ పై చేస్తున్న ఆరోపణలను ప్రశ్నించగలరా అంటూ తెలుగుదేశం పార్టీ నేత , శాప్ ఛైర్మన్ రవి నాయుడు తిరుపతి ప్రెస్ క్లబ్ మీడియా ముందు మాజీ సీఎం వైయస్ జగన్ ను ప్రశ్నించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శాప్ ఛైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని నడిబొడ్డున విజయవాడ దద్దరిల్లేదట్టుగా ఆదివారం మెగా డీఎస్సీ లో ఉద్యోగం సాధించిన టీచర్లందరూ కలిసి నీ రాజకీయ అధికార దాహం కోసం మా జీవితాలను బలి చేయొద్దు జగన్ రెడ్డి అంటూ నిర్వహించిన ర్యాలీ దేశ చరిత్రలోనే ప్రతిపక్షం కానీ ప్రతిపక్షం పై టీచర్లు ర్యాలీ చేయడం సిగ్గుచేటని, వైసిపి హయాంలో టీచర్లను మద్యం దుకాణాల వద్ద మద్యం అమ్మించిన ఘనత జగన్ రెడ్డి ది. అసెంబ్లీలో జరిగే డీఎస్సీ పై చర్చలకు జగన్ రెడ్డి వస్తే స్పీకర్ తో చర్చించి మీకు ఎంత సమయం కావాలంటే అంత సమయం కేటాయించమని మేము కూడా ప్రాధేయపడతామని, చర్చలకు రాకపోతే నీకు నిరుద్యోగులపై కపట ప్రేమ ఉందని, డీఎస్సీ పై మీరు చేస్తున్న ఆరోపణలన్నీ తప్పుడు ఆరోపణలని ప్రజలు గ్రహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోట వాసు దేవా, కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.




# కనుల పండుగగా

# ఏపీ ఫైర్ మర్చంట్స్ అసోసియేషన్ శతాబ్ది వేడుకలు



**తిరుపతి –సూర్యవాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ఫైర్ మర్చంట్స్ అసోసియేషన్ (క్రాకర్స్ అసోసియేషన్) 100వ సంవత్సరాల వేడుకలు తిరుపతి వినాయక సాగర్ లో జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ ఫైర్ క్రాకర్స్ (బాణసంచా) షో చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పట్టణ ప్రముఖులైనా రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ క్రాకర్స్ అసోసియేషన్ తమ 100 సంవత్సరాల వేడుకలను పవిత్ర నగరమైన తిరుపతిలో నిర్వహించడం చాలా ఆనందదాయకం అని ఆయన పేర్కొన్నారు.నగరవాసులు తమ కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ బాణసంచా ప్రదర్శనను సంతోషంగా వీక్షించడం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని, తిరుపతిలో ఇన్ని వేలాది మందిని ఒకేచోట చూసి చాలా రోజులైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రదర్శన అందరికీ స్పష్టంగా కనిపించేలా బయట అన్ని వైపులా ఏర్పాట్లు చేశారాని,రాబోయే రోజుల్లో తిరుపతిలో పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు తిరుపతి నగరంలో ఎక్కువ సమయం ఆహ్లాదకరంగా గడిపే విధంగా నగరాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటువంటి



వినోదభరితమైన కార్యక్రమాలు నగరంలో మరెన్నో జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, ఇంతటి అద్భుతమైన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫైర్ మర్చంట్స్ అసోసియేషన్ నిర్వాహకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి,తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదవ్ కార్పొరేషన్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, గ్రీనరీ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ,శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి,పులివర్తి సుధా రెడ్డి, అదనపు ఎస్పీ రవిమహనోహరాచారి, కూటమి నాయకులు, క్రాకర్ అసోసియేషన్ సభ్యులు,నగరవాసులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి భక్తుడు..

# మునిరామ్ రెడ్డిని వరించిన 'బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు'

**- వే ఫౌండేషన్ సభ్యుల, పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులకు అభినందనలు**



**తిరుపతి –సూర్యవాస్తవం:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధిలో ప్రజలు, భక్తుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, వారి పక్షాన నిలబడి నిజాన్ని నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న టాక్ ఆఫ్ ది టౌన్ పత్రిక ప్రతినిధి మునిరామ్ రెడ్డిని ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు' వరించింది.తిరుపతి మహతి ఆడిటోరియంలో మాతా శ్రీ శ్రీ రమ్యానంద భారతి స్వామిని, కావూరి శ్రీనివాస్ శర్మ తదితర ముఖ్య అతిథులు వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ వార్షికోత్సవ వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డు ప్రదానం కార్యక్రమంలో..టాక్ ఆఫ్ ది టౌన్

**మునిరామ్ రెడ్డికి ' బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు'ను ఘనంగా ప్రదానం చేశారు.**

జర్నలిజం రంగంలో మీరు చూపిన అసాధారణ ప్రతిభను గుర్తిస్తూ ఈ అవార్డును అందజేస్తున్నాము. అత్యుత్తమ ప్రతిభ, నిజాయితీతో కూడిన జర్నలిజం, నిబద్ధతతో పాటు సత్యం పట్ల మీరు చూపిన అంకితభావాన్ని,అద్భుత వార్తా కథనాలు,సమాజం పట్ల బాధ్యతాయుతమైన పాత్రను గుర్తిస్తూ, విశేష సేవలు, గణనీయమైన కృషిని గౌరవిస్తున్నట్లు లిఖిత పూర్వక అవార్డును ప్రదానం చేశారు.

**వెన్నంటి నిలిచిన సతీమణి పుష్ప రెడ్డి చేతుల మీదుగా సత్కారం**

మునిరామ్ రెడ్డి పాత్రికేయ ప్రస్థానంతోపాటు, అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు ,ప్రతి అడుగులో నూవెన్నంటి నిలిచి, ప్రోత్సహిస్తున్న ఆయన సతీమణి బిజెపి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు,శ్రీ విజయ గణపతి ఆలయ ధర్మకర్త పుష్ప రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులతో కలిసి ఆయనను



సత్కరించాలని ఆహ్వానించి, ఆమె చేతుల మీదుగా కూడా అవార్డు ప్రదానం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇలాగే ఇద్దరు కలిసి ఇలాగే మరెంతో ముందుకు సాగాలని పౌండేషన్ సభ్యులు అభినందిస్తూ, ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మునిరామ్ రెడ్డి మాట్లాడుతూ, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి భక్తులు, స్థానిక ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తున్న తన పాత్రికేయ సేవలను గుర్తించి ఈ అవార్డుతో సత్కరించడం మరింత బాధ్యతను పెంచిందని,అంతా అమ్మవారి అనుగ్రహం. తల్లిదండ్రుల ఆశీస్సులతో సాధ్యమైందని ,80 వ స్వాతంత్ర దినోత్సవం రోజున ,2026 సంవత్సరం బెస్ట్ జర్నలిస్టు అవార్డు శుభవార్త చెప్పినందుకు,అవార్డు ప్రదానం చేసిన వే ఫౌండేషన్ వారికి, పెద్దలు విజయ సంకల్పం ప్రసాద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ఆనందం వ్యక్తం చేశారు.టాక్ ఆఫ్ ది టౌన్ పత్రిక తరపున 'బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు' లభించడంపై, పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులను,ప్రముఖ ఉయ్యాల వాడ నరసింహా రెడ్డి ఫౌండేషన్ సభ్యులు,ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ నారాయణ రెడ్డి , బంధుమిత్రులు,హిందూ సంఘాల ప్రతినిధులు,పలువురు సైనికులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు.

## తిరుపతి జిల్లా యువ వాలీబాల్ క్రీడాకారిణిలతో

# శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ముఖాముఖి

**తిరుపతి –సూర్యవాస్తవం:** ఈ రోజు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తిరుపతి జిల్లాకు చెందిన యువ వాలీబాల్ క్రీడాకారిణిలతో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ప్రత్యేకంగా ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా కారిణులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన, వారి క్రీడా ప్రస్థానం, శిక్షణలో ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ లక్ష్యాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన అంశాలపై వివరంగా తెలుసుకున్నారు. అలాగే వారి ఆర్థిక పరిస్థితులు, విద్యార్హతలు, కుటుంబ నేపథ్యం, తల్లిదండ్రుల వివరాలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరియు



శాప్ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.క్రీడాకారిణిలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు పౌష్టికాహారం, సింథటిక్ వాలీబాల్ కోర్ట్, ఆధునిక క్రీడా సామగ్రి, మెరుగైన శిక్షణ సదుపాయాలు కల్పించాలని రవి నాయుడుని కోరారు.దీనిపై స్పందించిన ఆయన, మహిళా వాలీబాల్ క్రీడాకారిణిల ప్రతిభను మరింత ప్రోత్సహించేలా తిరుపతిలో ప్రత్యేక వాలీబాల్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ అకాడమీ ద్వారా నాణ్యమైన కోచింగ్, ఆధునిక క్రీడా సామగ్రి, మెరుగైన శిక్షణ సదుపాయాలు, పౌష్టికాహారం వంటి అవసరమైన సౌకర్యాలను అందించేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. మహిళా వాలీబాల్ క్రీడాకారిణిలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకువచ్చేలా శాప్ ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తుందని రవి నాయుడు స్పష్టం చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )